# మళ్లీ పాపపు కూతలు

▸ మొదటిపేజీ తరువాయి...

పని చెప్పారు. విద్యార్థుల కార్యక్రమం, ఆధ్యాత్మిక కార్యక్రమంలో రాజకీయాలు ఉండొద్దనే విచక్షణ మరిచిన రేవంత్‌రెడ్డి ప్రసంగం మొత్తం కేసీఆర్‌ను తిట్టిపోశారు. ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ సభలో కేసీఆర్ మాటలకు ప్రతి విమర్శలు చేసేందుకు రేవంత్‌రెడ్డి ఈ వేదికను వినియోగించుకున్నారు. ఓ పెద్దాయన (కేసీఆర్‌ను ఉద్దేశించి) వరంగల్ సభలో రాష్ట్రంలో పథకాలన్నీ ఆగిపోయాయని అంటున్నారని, ఏ పథకం ఆగిపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుబంధు ఆగిందా? కల్యాణలక్ష్మి ఆగిందా? షాదీ ముబారక్ ఆగిందా? ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆగిందా? ఉచిత విద్యుత్తు ఆగిందా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఏడాదిలోనే రూ. 2.5 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిందని, 60వేల ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు.

### నీ చరిత్రకు అక్కడే శాశ్వత సమాధి

కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి మరోసారి తన నోటి దురుసు ప్రదర్శించారు. ఇటీవలే కేసీఆర్ మరణాన్ని ఆకాంక్షించేలా చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో నాలుక మడతేసిన సీఎం.. మీడియాతో చిట్‌చాట్ పెట్టి తాను ఎవరి మరణాన్ని కాంక్షించడం లేదని వివరణ ఇచ్చుకున్నారు. ఇది జరిగి కొద్ది రోజులైనా గడవక ముందే మళ్లీ నోటి దురుసును ప్రదర్శించారు. బసవేశ్వర జయంతి సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ అయినా పదేండ్లు అధికారంలో ఉంటుందని, తామూ పదేండ్లు అధికారంలో ఉంటామని చెప్పారు. కేసీఆర్‌ను ఉద్దేశిస్తూ ‘నీ చరిత్ర అక్కడే శాశ్వతంగా సమాధి అయిపోతుంది’ అని వ్యాఖ్యానించారు.

### నా పేరెత్తే ధైర్యం చేయలేదు

వరంగల్ సభ మొత్తంలో ఆయన (కేసీఆర్) తన పేరు తీయలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. తన పేరు తీసుకునే ధైర్యం రాలేదని పేర్కొన్నారు. అయితే తన ప్రసంగం మొత్తం కేసీఆర్‌ను ఉద్దేశించి మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఎక్కడా కేసీఆర్ పేరు ఉచ్చరించకపోవడం గమనార్హం. అంటే కేసీఆర్ పేరు తీసేందుకు రేవంత్‌రెడ్డికి కూడా ధైర్యం చాలలేదా అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### బసవన్నను అవమానించేలా...


బసవేశ్వరుని జయంతి కార్యక్రమం సాక్షిగా రేవంత్ బసవన్న(ఎద్దు)ను అవమానించేలా వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌ను ఉద్దేశిస్తూ ‘అచ్చొచ్చిన ఆంబోతులా’ అంటూ నోటి దురుసు ప్రదర్శించారు. బసవేశ్వరుని ప్రతిరూపంగా బసవన్నను కొలుస్తారు. అలాంటి కార్యక్రమంలోనే బసవన్నను అవమానించేలా వ్యాఖ్యలు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### మాట ఇస్తే నూరు శాతం అమలు చేస్తా

తాను ఒక మాట ఇస్తే నూటికి నూరు శాతం అమలు చేస్తానని రేవంత్ చెప్పారు. ఇంత వరకు ఎక్కడ కూడా ఈ మాట ఇచ్చి చేయలేదని శత్రువులు కూడా అనలేదని పేర్కొన్నారు. మాట ఇచ్చేముందే తాను ఆలోచించి ఇస్తానని చెప్పారు. దీంతో సీఎం వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. ఎన్నికల సమయంలో రైతుభరోసా 15వేలు ఇస్తామని చెప్పింది, 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పింది, ధాన్యానికి బోనస్ ఇస్తామన్నది మీరే కదా... ఎందుకు అమలు చేయడం లేదంటూ? ప్రశ్నిస్తున్నారు. రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమంలో మరో మాట కూడా చెప్పారు. మాటలు మాట్లాడే ముందు విచక్షణ ఉండాలి కదా అంటూ వరంగల్‌లో కేసీఆర్ ప్రసంగాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఏదైనా మాట్లాడితే ప్రజలు ఏమనుకుంటారనే ఆలోచన ఉండొద్దా అని అన్నారు. కానీ విచక్షణ గురించి మాట్లాడిన సీఎం.. ఇదే సభలో విచక్షణ మరిచి మాట్లాడారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ విమర్శలు చేయడం, తప్పుడు ప్రకటనలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# రేవంత్‌రెడ్డికి నిలువెల్లా విషం

- అందుకే కేసీఆర్‌పై పిచ్చి ప్రేలాపనలు
- విద్యార్థుల ముందే సీఎం రోత మాటలు
- కేసీఆర్ కిట్, దళితబంధు ఆగలేదా?
- కాంగ్రెస్ పథకాలపై చర్చకు సిద్ధం
- కాంగ్రెస్‌కు పదేండ్ల అధికారం కలే
- ముందు.. ఉన్న కుర్చీని కాపాడుకో
- రేవంత్‌పై హరీశ్‌రావు విమర్శలు



హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ‘సీఎం రేవంత్‌రెడ్డి ఎంతకు దిగజారాడంటే బసవేశ్వరుడి జయంతిని కూడా తన చిల్లర రాజకీయాల కోసం వాడుకున్నడు’ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా నిప్పులు చెరిగారు. చివరకు పదో తరగతి ఫలితాల విడుదలను కూడా తన రాజకీయ అవసరానికి వాడుకున్నడని దుయ్యబట్టారు. విద్యార్థులను ముందు పెట్టుకొని నీచంగా మాట్లాడి, ముఖ్యమంత్రి స్థాయిని, హోదాను దిగజార్చారని దుయ్యబట్టారు. ‘అచ్చోసిన ఆంబోతు అంటడు, సమాధి అంటడు. కనీసం సోయి లేకుండా మాట్లాడిండు. ఇదేనా విద్యార్థులకు నువ్వు చెప్పేది రేవంత్‌రెడ్డీ? అని అగ్గిమీద గుగ్గిలమయ్యారు. పది ఫలితాల సందర్భంగా రవీంద్రభారతిలో రాజకీయాలు మాట్లాడి, దాని గౌరవాన్నే తగ్గించినవు’ అంటూ రేవంత్‌పై నిప్పులు చెరిగారు.

### కాంగ్రెస్ ముమ్మాటికీ విలనే

‘కేసీఆర్ అన్నట్టు కాంగ్రెస్ ముమ్మాటికీ తెలంగాణకు విలనే. తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేదు. కేంద్రం మెడలు వంచి సాధించిండు కేసీఆర్. అది ఇచ్చినోళ్ల గొప్పతనమా, సాధించినోళ్ల గొప్పతనమా?’ అని హరీశ్ ప్రశ్నించారు. ప్రజలు కష్టాల్లో ఉంటే కేసీఆర్ ఎందుకు రావడం లేదని రేవంత్ అంటున్నారని, మరోవైపు ప్రజలకు కష్టాలు లేవు, తమది ప్రజా పాలన అని చెప్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి జపాన్ వెళ్లి వచ్చిన తర్వాత మైండ్ పాడైనట్టుందని, లేదంటే రజతోత్సవ సభకు వచ్చిన జనాన్ని చూసి మైండ్ బ్లాంక్ అయి ఉంటుందని దుయ్యబట్టారు.

### విద్యార్థుల మెదళ్లలో విషం నింపుతున్న సీఎం

విద్యార్థుల మెదళ్లలో విషం నింపుతున్న ఇలాంటి సీఎం బహుశా ఎక్కడా ఉండడని, రజతోత్సవ సభను చూసినప్పటి నుంచి సీఎంకు నిద్ర పట్టడం లేదని, కళ్లలో, కడుపులో మాత్రమే కాదు.. ఆయన నిలువెల్లా విషం నింపుకున్నడని, కడుపులో పెట్టుకున్న విషాన్ని, ఆపుకోలేక పది ఫలితాలను అడ్డం పెట్టుకుని బయటకు కక్కిండని హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు. కేసీఆర్ గురించి అవే చిల్లర మాటలు మాట్లాడి, కుక్క తోక వంకర.. అని రేవంత్ మరోసారి రుజువు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### సవాల్‌ను స్వీకరిస్తున్నా..

రేవంత్ సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్టు హరీశ్‌రావు ప్రకటించారు. ‘కాళేశ్వరం మీద చర్చ పెడదామా? రుణమాఫీ మీద పెడదామా? రైతుబంధు మీద పెడుదామా? బోగస్ 60వేల ఉద్యోగాల మీద పెడదామా? కులగణన మీద పెడదామా? దేనికైనా రెడీ. ప్లేస్, టైం మీరే చెప్పండి’ అంటూ హరీశ్ సవాల్ విసిరారు. పదేండ్లు తానే అధికారంలో ఉంటానని పగటి కలలు కంటున్న రేవంత్‌రెడ్డి.. ఉన్న మూడేండ్లు కుర్చీ సక్కగ ఉండేలా చూసుకోవాలని ఎద్దేవా చేశారు. అతి తక్కువ కాలంలో అన్నివర్గాల ప్రజలతో తిట్లు తింటున్న ఏకైక సీఎం రేవంతేనని తూర్పారపట్టారు. ‘కేసీఆర్ నీ పేరు పలకాలని ఎన్నో రోజుల నుంచి అడుక్కుంటున్నావు కదా. కుసంస్కారం, కుంచిత స్వభావం ఉన్న నీ లాంటి వారి పేరును కేసీఆర్ ఎత్తాల్సిన అవసరం ఏమిటి?’ అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

### కేసీఆర్ కిట్టు, దళితబంధు, పింఛన్లు ఆగలేదా?

ఏ పథకం ఆగిందో చెప్పాలని రేవంత్‌రెడ్డి అంటున్నారని, కేసీఆర్ కిట్, దళితబంధు, బీసీబంధు, గొర్రెల పంపిణీ, రెండు నెలల పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ఆగలేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, ఏడాదిలో రెండున్నర లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు విద్యాభరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీలు, మహిళలకు రూ.2,500, తులం బంగారం, కౌలు రైతులకు భరోసా, రూ.15వేల రైతు భరోసా.. ఏమైందంటూ పథకాల పేర్లతో రేవంత్‌రెడ్డిని కడిగి పారేశారు.

# పోలీసులు సుమోటోగా కేసు పెట్టాల్సిందే

## కేసీఆర్‌పై రేవంత్ పదేపదే దుర్భాషలు .. రాజకీయ విశ్లేషకులు, సీనియర్ పాత్రికేయుల ఫైర్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి స్థానంలో ఉండి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ చావును పదేపదే కోరుకుంటుండటంపై రాజకీయ విశ్లేషకులు, సీనియర్ పాత్రికేయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సమయం, సందర్భం లేకుండా వేదిక ఏదనేది చూడకుండా ప్రభుత్వ కార్యక్రమమా, పార్టీ కార్యక్రమమా అని పట్టించుకోకుండా సభ్యత, సంస్కారాలు మరిచి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం దిగజారుతున్న ప్రమాణాలకు నిదర్శనమని వ్యాఖ్యానిస్తున్నారు. రేవంత్‌రెడ్డిని తిట్టారనే ఆరోపణలమీద అనేకమంది సామాన్యులపై, నిరుపేదలపై, దళితులపై, సోషల్ మీడియా వారియర్లపై కేసులు పెడుతున్న పోలీసులు మరి గత కొంత కాలంగా కేసీఆర్ మీద రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉందని వారు పేర్కొంటున్నారు. పోలీసులు శాసనానికి, రాజ్యాంగానికి బద్ధులని, వారు చట్టప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందని సూచిస్తున్నారు. దేశంలో ప్రముఖులకు ఒక న్యాయం, మాములు వాళ్లకు మరో న్యాయం అని ఏమీ లేదని, ఒకవేళ కడుపు మండిన పేదలు రేవంత్‌రెడ్డిని తిట్టడం శిక్షార్హమైన నేరమైతే, రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను తిట్టడం కూడా నేరమే అవుతుందని వారు స్పష్టం చేస్తున్నారు. పరుష వ్యాఖ్యలు చేసిన వారిపైనే కాదు, ఆ వ్యాఖ్యలను పోస్టు చేసిన వారిపైనా పోలీసులు సుమోటోగా కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారని, అలాంటప్పుడు వారు కేసీఆర్‌పై పరుష వ్యాఖ్యలు చేస్తున్న రేవంత్‌పైనా కేసులు పెట్టాల్సి ఉంటుందని పరిశీలకులు తేల్చి చెప్తున్నారు. తెలంగాణ పోలీసులు, పోలీసు శాఖ నిజంగా, నిజాయతీగా చట్టాలకు అనుగుణంగా నడుచుకుంటుంటే అది తనంత తానుగా రేవంత్‌రెడ్డి మీద కేసులు పెట్టి తన నిక్కచ్చితనాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుందని పరిశీలకులు సవాలు విసురుతున్నారు. సోషల్ మీడియాలో చేస్తున్న వ్యాఖ్యలు తన కుటుంబ సభ్యులను ఎంతో బాధిస్తున్నాయని, అందుకే కేసులు పెడుతున్నామని రేవంత్‌రెడ్డి వివరణ ఇచ్చారని, మరి ఇప్పుడు రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు కేసీఆర్ కుటుంబ సభ్యులనే కాకుండా కోట్లాదిమంది తెలంగాణ ప్రజలను బాధపెడుతున్నాయని, అలాంటప్పుడు రేవంత్‌పై పోలీసులు కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని సీనియర్ పాత్రికేయులు ప్రశ్నిస్తున్నారు.

# ఆరు గ్యారెంటీల అమలెక్కడ?

- రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు ధ్వజం



హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయహస్తం గ్యారెంటీల అమలు ఏమైందో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి? తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. కాళేశ్వరాన్ని ఎండబెట్టి తెలంగాణను ఏడారిగా మార్చాలనుకుంటున్నారా అంటూ నిప్పులుచెరిగారు. రాష్ట్రంలో పదేండ్లు సీఎంగా ఉంటానని చెప్తున్న రేవంత్‌రెడ్డి జపాన్ నుంచి బంక ఏమైనా కొనుకొచ్చారా? అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ చరిత్ర ఫాంహౌజ్‌లోనే శాశ్వత సమాధి అంటూ వ్యాఖ్యలు చేయడం దారుణమని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పెద్ద మనిషిని పట్టుకుని నీచమైన మాటలు మాట్లడుతారా అంటూ నిప్పులుచెరిగారు.

# రేవంత్‌కు రాజకీయ సమాధి ఖాయం

- బీఆర్‌ఎస్ వరంగల్ సభ సక్సెస్, రేవంత్‌రెడ్డికి మైండ్‌బ్లాక్
- సీఎంను మంత్రులే గుర్తిస్తలేరు
- నీ గురించి కేసీఆర్ మాట్లాడాలా?
- మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఫైర్



హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ చరిత్ర సమాధి అవడం కాదని.. సీఎం రేవంత్‌కు కొడంగల్‌లో రాజకీయ సమాధి ఖాయమని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. పదో తరగతి ఫలితాల విడుదల, బసవేశ్వర జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో రేవంత్‌రెడ్డి కేసీఆర్ మీద చేసిన వ్యాఖ్యలపై వేముల ఘాటుగా స్పందించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నన్ని రోజులు కేసీఆర్ పేరు సువర్ణాక్షరాలతో రాసి ఉంటుందని తెలిపారు. ఓటుకు నోటు కేసు ముద్దాయిగా, ఒక విఫల సీఎంగా రేవంత్ పేరు ఉంటుందని పేర్కొన్నారు. వరంగల్ సభ విజయవంతం కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి మైండ్ బ్లాక్ అయ్యి పిచ్చి మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. తాను కమిట్‌మెంట్ ఇస్తే మాట తప్పను అని మహాత్మా బసవేశ్వరుడి సాక్షిగా సీఎం పచ్చి అబద్ధాలు చెప్పారని విమర్శించారు. కేసీఆర్ చరిత్రను సమాధి చేసేంత శక్తి, స్థాయి రేవంత్‌రెడ్డికి లేదని తెలిపారు.

### చిరకాలం కేసీఆర్ పేరు

రూ.2000 ఆసరా పింఛన్ అందుకున్న అవ్వ తాతలు, బీడీ కార్మికుల చిరునవ్వుల్లో, రూ.4000 పెన్షన్ అందుకున్న దివ్యాంగుల్లో, రైతుబంధు, రైతు బీమా పొందిన లక్షల మంది రైతుల కుటుంబాల్లో కేసీఆర్ ఉన్నారని వేముల గుర్తుచేశారు. తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడిన వ్యక్తిగా కేసీఆర్ పేరు రాష్ట్ర చరిత్రలో కలకాలం నిలిచి ఉంటుందని పేర్కొన్నారు.

### రేవంత్‌ది ఫ్రస్ట్రేషన్

లక్షల మంది తరలివచ్చిన వరంగల్ సభలో కేసీఆర్ తన పేరు తీయలేదనే ఫ్రస్ట్రేషన్‌లో రేవంత్‌రెడ్డి ఉన్నాడని ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ‘నేను అబద్ధాలు మాట్లాడను కానీ చెప్పేటివి నిజాలు కావు’ అన్న చందంగా ముఖ్యమంత్రి వ్యవహారం ఉందని చురకలు అంటించారు. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేస్తున్నారా అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు.

మరిన్ని వార్తలు ntnews.comలో చూడగలరు


## అమూల్ పాల ధరలలో మార్పు వచ్చింది

| ఉత్పాదన | ఎస్‌కెయు | ప్రస్తుత ఎంఆర్‌పి*(₹) | కొత్త ఎంఆర్‌పి*(₹) |
|---|---|---|---|
| అమూల్ గేదె పాలు | 500 mL | 39 | 40 |
| | 1L | 77 | 79 |
| అమూల్ గోల్డ్ | 500 mL | 35 | 36 |
| అమూల్ తాజా | 500 mL | 28 | 29 |
| | 1L | 55 | 57 |
| అమూల్ టాయ్ మజా | 500 mL | 29 | 30 |
| | 1L | 57 | 59 |

*ఎంఆర్‌పి (అన్ని పన్నులూ కలుపుకుని). షరతులు వర్తిస్తాయి.

ఈ కొత్త ధరలు హైదరాబాద్ మరియు దగ్గరలో ఉన్న మార్కెట్లలో 1 మే, 2025 ఉదయం నుండి వర్తిస్తాయి.



అమూల్ పాలు

Amul The Taste of India

పెరుగుతున్న పాల ప్రొడక్షన్ యొక్క ఇన్‌పుట్ ఖర్చుల కారణంగా, మేము పాల ధరలను పెంచాము. అధిక సమాచారానికై ఇక్కడ సంప్రదించండి: 1800-258-3333 / ఈమెయిల్: customercare@amul.coop



